క్లుప్తంగా

మంత్రిని కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యాయామ ఉపాధ్యాయుల పదోన్నతులు, సంఘం సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యలపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.రాఘవరెడ్డి, పి.కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, పోలెబోయిన అనిల్‌కుమార్, దినేష్‌కుమార్, ఉపాధ్యాయులు కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెల్లంను పరామర్శించిన పొంగులేటి



తెల్లం వెంకట్రావును పరామర్శిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని భద్రాచలం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తెల్లం వెంకట్రావును మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. పొంగులేటి వెంట పాయం వెంకటేశ్వర్లు, తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

సంతాప సభ

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఓసీ–2లో గత రెండు రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన బీ–రిలే ఆపరేటర్ దాసరి భూషణం సంతాపసభను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేనేజర్, సీ–రిలే ఇన్‌చార్జ్ భూక్యా భాంగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాసరి భూషణం సంస్థకు చేసిన సేవలను కొనియాడారు. మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అధికారులు నాగేంద్ర, బాబ్జీ, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు కె వెంకటేశ్వర్లు, కె శ్రీనివాస్, సుకుమార్, అశోక్, టీబీజీకేఎస్ నాయకులు శంకర్, సమన్వయకర్త ఎస్డీ నాసర్‌పాషా, కార్మికులు సమీంద్రచారి, గట్టయ్య, కుమారస్వామి, కేశవస్వామి, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

మణుగూరురూరల్: మణుగూరు వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల చోటుచేసుకున్న రెండు ఘటనలపై జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని టీడీపీ పార్లమెంటరీ మాజీ కార్యదర్శి వాసిరెడ్డి చలపతిరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యం కోసం వెళ్లిన సాంబాయిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి మస్తాన్‌బీ తన బిడ్డను కోల్పోగా.. ఇటీవలే చిక్కుడుగుంట గ్రామానికి చెందిన గర్భిణి బత్తుల రేష్మా బిడ్డకు జన్మనిచ్చి మరణించిందని తెలిపారు. ఆయా సంఘటనలకు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలపై జిల్లా అధికారులు స్పందించి పూర్తి విచారణ చేపట్టి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి దేవాలయంలో నేటి(శుక్రవారం) నుంచి ఆదివారం వరకు శివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు. ఆలయంలో జరిగే పూజ కార్యక్రమాల వివరాలను ఆయన వివరించారు. ఆలయంలో శుక్రవారం పలు రకాల పూజలు, శనివారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం, అభిషేకాలు, హోమాలు, గ్రామోత్సవం, రథోత్సవంతోపాటు ఇతర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శివరాత్రిరోడు ఆలయంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం, ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన గాజుల శ్రీనివాసరావు–శుభలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అటు ఎండ.. ఇటు చలి!

- ఏజెన్సీలో భిన్న వాతావరణం
- ఉక్కపోత, వణుకుతో ప్రజలు సతమతం
- వాతావరణ మార్పులతో ఆరోగ్యంపై ప్రభావం



మధ్యాహ్నం ఎండలకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



ఉదయం చలిమంట కాస్తున్న గ్రామస్తులు

కరకగూడెం: గత కొద్ది రోజులుగా ఏజెన్సీలో భిన్న వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దాని ఫలితంగా ప్రజలు ఎండా, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రాత్రి వేళలో చలి ఏమాత్రం తగ్గడం లేదు. సాధారణంగా మహాశివరాత్రి పర్వదినం దాటితే వేసవికాలం వచ్చినట్లు భావిస్తాం. కానీ ఈ సారి శివరాత్రికన్న ముందే వేసవి వచ్చినట్లుగా వాతవరణం కనిపిస్తోంది. గడిచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు, అలాగే చలిగాలుల ప్రభావంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత తట్టుకోవడానికి కొన్ని చోట్ల ప్రజలు చలి మంట వేసుకుంటున్నారు.

పగలు భగ భగ.. రాత్రి గజ గజ

వాతవరణంలో మార్పులతో జనం సతమతమవుతున్నారు. తెల్లవారుజామున చల్లటి గాలులు, పగలు ఎండ వేడిమి మరోవైపు చలి తీవ్రతతో మండలంలో భిన్న వాతవరణం నెలకొంది. మరోపక్క రికార్డు స్థాయిలో పగటిపూట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతేకాకుండ గత వారం రోజులుగా రాత్రి, పగటి ఉష్ణోగ్రతల్లో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో పగలు సూర్యుడు భగభగ మంటున్నాడు రాత్రి చలితో గజగజ వణికిస్తోంది.

అనారోగ్యం పాలవుతున్న పిల్లలు, వృద్ధులు

పగలు ఎండలు, సాయంత్రం నుంచి చల్లని గాలులు ఒక్కసారిగా వాతవరణంలో మార్పులతో కొన్ని వ్యాధులను తీసుకొస్తున్నాయి. జలుబు, దగ్గు, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు, న్యూమోనియా, చలి జ్వరం బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు క్యూకట్టే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూ కనిపిస్తోంది.

వైద్యుల సూచనలివిగో..

ప్రజలు అనారోగ్యం పాలవుతున్న నేపథ్యంలో వైద్యులు కొన్ని సలహాలు సూచనలిస్తున్నారు. పిల్లలకు చలి గాలి, వేడి గాలి తగలకుండా చూడాలని, సూర్యోదయం తర్వాతే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని చెబుతున్నారు. సాయంత్రం 6 తర్వాత ఇంట్లోనే ఉంచాలని, అవసరాన్ని బట్టి తల, చెవులు, ముక్కు కప్పి ఉంచేలా ఉన్ని దుస్తులు ధరింపజేయాలని సూచిస్తున్నారు. బయటికి వెళ్లినప్పుడు కళ్లకు చల్లగాలి తగలకుండా అద్దాలు, స్వెట్టర్లు, మఫ్లర్స్ ఉపయోగించాలని చెబుతున్నారు.

తట్టుకోలేనంతగా ఉక్కపోత..



గత వారం రోజుల నుంచి భిన్న వాతవరణ మార్పులతో తీవ్రమైన ఉక్కపోతలకి గురవుతున్నాం. ఉదయం 10 గంటలు దాటితే ఎండ వేడిమిని భరించలేకపోతున్నాం. పొలం పనులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాతవరణం చల్లబడ్డాక చేసుకుంటున్నాం.

– పోలెబోయిన సాంబశివరావు, పాపాయిగూడెం

చలి బాగా పెరిగింది



ఉదయం చల్లని గాలులు, పగలు ఎండ తీవ్రత, రాత్రి తీవ్రమైన చలితో ఇబ్బందిపడుతున్నాం. గడిచిన వారం నుండి చలి బాగా పెరిగింది. దీనికి తోడు జలుబు, దగ్గు, జ్వరంతో పిల్లలు, పెద్దలు ఇబ్బందిపడక తప్పడంలేదు. ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఊహించలేదు.

– పాసాల ఆదిలక్ష్మి, అనంతారం

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలం నుంచి వేసవిలోకి మార్పు సమయంలో భిన్న వాతవరణ పరిస్థితులు తప్పక ఉంటాయి. ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పిల్లలకు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం వంటి వాటిని దూరంగా ఉంచాలి. ఒంట్లో వేడిని నింపేలా వాల్‌నట్స్, పిస్తా వంటివి అలవాటు చేయాలి.

– కారం మధు, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నర్సయ్య, ఇతర నాయకులు

భద్రాచలంటౌన్: ఏకగ్రీవ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. పాల్వంచ మండలంలోని చంద్రలగూడెం ఏకగ్రీవ గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీఓ గౌతమ్ పొట్రుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రలగూడెం గ్రామ పంచాయతీ పేరుకే ఏకగ్రీవం తప్ప అభివృద్ధికి నోచుకోలేదని, అనేక సమస్యలకు నిలయంగా మారిందని అన్నారు. అలాగే తుమ్మలగూడెం నుంచి వెంకటాపురం వరకు బీటీ రోడ్డు నిర్మించి కిన్నెరసాని వాగుపై వంతెన నిర్మించాలని అన్నారు. కిన్నెరసాని ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలను మరమ్మతులు చేపట్టి బంగారుచలక వరకు సాగునీరు అందించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే త్రీఫేస్ విద్యుత్ కల్పించి గిరి వికాస పథకం ద్వారా బోర్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముద్దా బిక్షం, జాటోతు కృష్ణ, ఆజాద్, బానోత్ ధర్మ, కుంజా పార్వతి, బాడిస పాపారావు, ఈసం చిన్న నారాయణ, వెంకటేశ్వర్లు, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించండి

చండ్రుగొండ: అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాల నేపథ్యంలో విధిగా ప్రొటోకాల్ పాటించాలని ఎంపీపీ బాణోత్ పార్వతి వివిధ శాఖాధికారులకు సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఇటీవలకాలంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల సమాచారం తనకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. వేసవి సెలవులు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖాధికారులకు ఎంపీపీ ఆదేశించారు. తిప్పనపల్లి నుంచి తుంగారం వెళ్లే మార్గంలో రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించాలని విద్యుత్ ఏఈకి సూచించారు.

వచ్చే ఏడాది నుంచి పంటల కొనుగోళ్లు చేస్తాం.. చండ్రుగొండలో ఉన్న మార్కెట్‌యార్డ్ భవనసముదాయాలను మరమ్మతు చేయించి వచ్చే ఏడాది నుంచి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తామని కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు వెల్లడించారు. ఎంపీపీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున ఇక్కడ ఉన్న గిడ్డంగులను రైతులకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్డీ రసూల్, వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ పార్వతి

పోస్టు కార్డు ఉద్యమం



పోస్టు కార్డులతో విద్యార్థులు

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పండిట్ ఉద్యోగుల ప్రమోషన్ కల్పించాలని పండిట్ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 1నుంచి 9,10 తరగతులు బహిష్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తుండటంతో గురువారం మణుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పోస్టు కార్డు ఉద్యమం ప్రారంభించారు.

పండిట్ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రమోషన్ కల్పించి వారి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ 9,10 తరగతులు విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఇబ్బంది లేకుండా చూడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, తెలంగాణ ప్రభుత్వానికి పోస్టు కార్డులు రాసి పంపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న పండిత ఉపాధ్యాయుల ప్రమోషన్ కేసులకు పరిష్కారం త్వరగా చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పండిత ఉపాధ్యాయులు టీఎస్‌టీటీఎఫ్ జిల్లా నేతల భూక్యా శంకర్ నాయక్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేడు టాలెంట్ టెస్ట్

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అశ్వాపురం, మణుగూరు మండలాల్లోని హైస్కూళ్లు, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నేడు ఉదయం 11 గంటలకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. టాలెంట్ టెస్ట్ రాసిన ప్రతి విద్యార్థికీ పెన్ను, రైటింగ్ ప్యాడ్ ఉచితంగా అందజేస్తామన్నారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను బస్సుల్లో తీసుకువస్తామని, టెస్ట్ అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు విద్యుత్ కోత

దుమ్ముగూడెం: మండలంలో విద్యుత్ సరఫరాలో శుక్రవారం స్వల్ప అంతరాయం కలుగనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు నేపథ్యంలో విద్యుత్ సరఫరాను వెంకటాపురం నుంచి తీసుకునే సందర్భంగా శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సాయుధ పోరాట యోధుడి మృతి

చండ్రుగొండ: తెలంగాణ సాయుధపోరాటంలో అలుపెరుగని పోరాటం చేసిన సూర కృష్ణయ్య (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. కృష్ణయ్య భౌతికగాయాన్ని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, వైస్‌ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ దారా వెంకటేశ్వరరావు, చీదళ్ల పవన్‌బాబు, గాదే శివప్రసాద్, భూపతి శ్రీనివాసరావు, పార్టీలకు అతీతంగా నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి నివాళులు అర్పించారు.

ఉద్యోగుల ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో పీకేఓసీ ఎంప్లాయిస్ కో ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీలో పొరుగు సేవల ఉద్యోగిగా పని చేస్తూ రోడ్డు ప్రమాదం మూలంగా మృతి చెందిన తెన్నేటి రవిచంద్ర కుటుంబాన్ని ఓసీ–2 పవర్ సెక్షన్ ఉద్యోగులు గురువారం పరామర్శించారు. రూ.15,100లను ఆర్థిక సహాయంగా అందజేశారు. అనంతరం రవిచంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. పవర్ సెక్సన్ ఉద్యోగులు చిట్టూరి రవిబాబు, వనమా రామారావు, మార్క్స్ ఆంతోటి, సుధాకర్, చింతల శంకర్ పాల్గొన్నారు.

వృద్ధుడి వైద్యానికి..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వృద్ధుడు పగిడిపల్లి కొమరయ్య సైకిల్ మీద నుంచి కింద పడి కాలు విరగడంతో గురువారం సర్పంచ్ మర్రి మల్లారెడ్డి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఉపసర్పంచ్ సుధీర్, మన్మథరెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

మణుగూరుటౌన్: ధ్యానంతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న అన్నారు. గురువారం హార్టుపుల్‌నెస్ శ్రీరామచంద్ర మిషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల ధ్యాన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ధ్యానంతో మానసిక ప్రశాంతతను పొందుతూ ఆరోగ్యంగా ఉద్యోగులు ఉండాలన్నారు. ఉద్యోగుల ప్రశాంతతో పూర్తి నిబద్ధతతో పనిచేసినప్పుడే నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. ప్రతినెలా మూడు రోజుల పాటు ఉద్యోగులకు ఈ ధ్యాన శిక్షణ అందుబాటులో ఉంటుందని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం హార్టుపుల్‌నెస్ జోనల్ ఇన్‌చార్జ్ టీవీ రమణ ఉద్యోగులతో ధ్యానం చేయించారు. ఈ ధ్యానంలో సీఈతోపాటు ఎస్ఈలు, డీఈలు, ఏఈలు ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌వీ ప్రసాదరావు, నోడల్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, సెంటర్‌కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, సాధకులు రాజశ్రీ, దివ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.



బీటీపీఎస్‌లో ఉద్యోగులతో కలిసి ధ్యానం చేస్తున్న సీఈ బిచ్చన్న

మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేయొద్దు



ఏరియా జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మైనింగ్ ఉద్యోగులు, సిబ్బంది

మణుగూరుటౌన్: భూపాలపల్లి కేటీకే ఓసీపీ–3 యాజీ ప్రాజెక్టులో జరిగిన గని ప్రమాదాకి మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేసి తీసుకున్న తీవ్రమైన క్రమశిక్షణ చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం మణుగూరు ఏరియా మైన్స్ సిబ్బంది జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మణుగూరు ఏరియా సూపర్ వైజర్స్ నాయకులు బిక్కసాని రవి మాట్లాడుతూ.. భూపాలపల్లిలో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదంలో ముగ్గురు మైనింగ్ సూపర్ వైజర్లు బత్తుల వెంకటేశ్వర్లు, సీనియర్ మైనింగ్ సర్దార్ శ్రీకాంత్ ఓవర్‌మెన్ సద్దుల ప్రకాశ్‌లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. షార్టుఫైర్ ప్రకాశ్‌ను ఏకంగా డిస్మిస్ చేయడం దారుణం అన్నారు. ఆ చర్యను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఏరియా సూపర్ వైజర్లు మైనింగ్ సిబ్బంది అభిలాష్, ఉపేందర్, సుబ్బరాజు, రామకృష్ణలు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కరకట్ట నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. గురువారం బాధితులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్ణశాల పంచాయతీ సీతానగరం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 51/1, 49/1, 44/3, 44/4, 30/1/ఎ, 27/2/ఎ, 44/5, 36/8 సాగు భూములు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు కరకట్ట నిర్మాణంలో పోతున్నాయని, వాటికి సంబంధించి పరిహారం చెల్లించాకే తవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బాధితులు పి.నాగమణి, వాగే చలపతిరావు, కోరం రామ చిట్టి, వాగే లక్ష్మయ్య, వాగే రాముడు, వాగే ఆదేమ్మ, వాగే ముత్తమ్మ, నాయకులు వాగే వెంకటేశ్వర రావు, కోరం మురళి, వాగే అల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న బాధితులు

పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలి



దీక్ష శిబిరంలో మాలమహానాడు నాయకులు

భద్రాచలంటౌన్: నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. ఈ మేరకు మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో ఒక్క రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపి భద్రాచలానికి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయాలని అన్నారు.

దళిత బంధు జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ శ్రీనివాసరావు, వాల్మీకి మండల అధ్యక్షుడు ఉండేటి రవి, నాగేశ్వరరావు, సేధాకర్, రవి, దాసు, కుమారి, జయమ్మ, రవికుమార్, స్వాతి, ఆదిలక్ష్మి, శాంత, రేవతి, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకుడిగా పనిచేస్తా..

ములకలపల్లి: ప్రజాసేవకుడిగా నిరంతరం పనిచేస్తూ.. నియోజవర్గ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత జగన్నాథపురంలో ఇటీవల పునఃనిర్మించిన రామాలయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే మెచ్చాకు స్వాగతం పలికారు. ఓ వివాహవేడుకకు హాజరైన అనంతరం మండలకేంద్రంలోని మంగపేట గిరిజన ప్రాథమిక ఆస్పత్రి వద్ద కోటిన్నర రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పీహెచ్‌సీలో గర్భిణులకు 'న్యూట్రీకిట్లు'అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడారు. సుమరు 40 ఏళ్ల క్రితం నిర్మించిన పీహెచ్‌సీకి ప్రత్యేక చొరవతో కోటిన్నర రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. అంతర్గత రోడ్ల సమస్య నివారణకు మండలవ్యాప్తంగా రూ.4 కోట్ల నిధులతో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యతాయుతంగా పనులు సాగాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావు, టీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోరంపూడి అప్పారావు, శనగపాటి అంజన్‌రావు, ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుధాకర్, గడ్డం భవాని, సున్నం సుశీల, గొల్ల పెంటయ్య, కీసరి శ్రీను, పీఆర్ఏఈ శివలాల్, డాక్టర్ సాయికల్యాణ్, రామాలయ ధర్మకర్త జలగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

కార్యక్రమాల్లో ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దార వెంకటేశ్వరరావు, నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, మెదా మోహన్‌రావు, చీదళ్ళ పవన్‌బాబు, భూపతి, భూపతి శ్రీనివాసరావు, సత్తి నాగేశ్వరరావు, ఉన్నం నాగరాజు, గుగులోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి పరామర్శ

చండ్రుగొండ: జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డిని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆయనను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పితృవియోగం అయిన బీఆర్ఎస్‌పార్టీ నాయకుడు సూరా వెంకటేశ్వర్లును, మారో నాయకుడు సారేపల్లి శేఖర్‌ను ఎమ్మెల్యే మెచ్చా పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులను కోరారు.

వినతుల వెల్లువ

అశ్వారావుపేటరూరల్: పలు సమస్యలు, అభివృద్ధి పనుల గురించి గురువారం స్థానికులు ఎమ్మెల్యేకు వినతులు చేశారు. మండలంలోని వినాయకపురం, ఆసుపాక, నందిపాడు, అశ్వారావుపేటలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పలు శుభ కార్యక్రమాల్లో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నందిపాడు గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని, ఆసుపాక గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఇందిరా సాగర్ పంప్ హౌజ్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేలా చర్యలు చేసుకోవాలని రైతులు కోరారు. దానివల్ల వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడుతానని అన్నారు. అలాగే అశ్వారావుపేటలో డిగ్రీ కళాశాలను మంజూరు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి చేశారు. కార్యక్రమాల్లో ఎస్సై బి.రాజేశ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి పుల్లారావు, నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, వెంకన్నబాబు, రాము ఉన్నారు.